

చనిపోయిన ఆత్మీయునికి కడపటి వీడ్కోలు పలికేందుకు బరువెక్కిన హృదయాలతో స్మశానానికి వెళుతున్న బంధుమిత్రుల్లా - ఆకాశంలో నల్లటి మబ్బులు మందకొడిగా పయనిస్తున్నాయి. మొసలి కోరల్లో చిక్కిన గజేంద్రుడి పాలిట శ్రీ మహావిష్ణువులా - 'ఎవరిని ఏ జబ్బు పట్టి పీడిస్తున్నా మాదీ అభయహస్తం' అంటూ రోడ్డుకవతల నగరంలో కొత్తగా ప్రారంభించిన కార్పొరేట్ హాస్పిటల్ తాలూకు భారీ హోర్డింగ్! ఆ పక్కనే 'చదువుల తల్లి చల్లని నీడ - బాలల భవితకు బంగరు బాట...' అంటూ ఓ ప్రైవేట్ స్కూలు ప్రకటనతో చిన్న హోర్డింగ్! నోట్లోంచి పేగులు బయటకు వచ్చేస్తాయా అన్నంతగా దగ్గుతున్న ఓ ముసలివాడూ, అతడి మనవరాలిగా ఉన్న ఓ చింకిపాతల పిల్లా ఆ హోర్డింగ్ దిగువన గుడ్డ పరుచుకుని అడుక్కుంటున్నారు.

ఇళ్ళను కూల్చివేసి విశాలంగా మార్చిన రోడ్డునూ, ఆ రోడ్డుపై వేగంగా దూసుకుపోతున్న కొత్త కొత్త వాహనాలనూ, ఆ ప్రకటనల హోర్డింగులనూ చూస్తూ 'చూస్తుండగానే ఊరు ఎంత మారిపోయిందీ! పదేళ్ళ కిందట చూసి, మళ్ళీ ఇప్పుడే వచ్చిన వారెవరూ ఇది రాజమండ్రే అంటే నమ్మలేనంతగా మారిపోయింది. మబ్బులను తలపాగా చుట్టుకోవడానికా అన్నట్టు ఎత్తెత్తుగా పుట్టుకు వస్తున్న అపార్ట్‌మెంట్లు, వీధికో స్కూలూ, ఓ ఆసుపత్రీ వెలశాయి. రుణాలిస్తామంటూ బ్యాంకులూ, వాహనాలు పట్టుకెళ్ళండంటూ మోటార్ సైకిల్ కంపెనీలూ రోడ్డెక్కుతున్నాయి. పదేళ్ళక్రితం కలలో కూడా ఊహించని సరుకులు బజార్లలో గుట్టలు గుట్టలుగా ఉన్నాయి. ప్రతి పదుగురిలో సగం మంది చేతుల్లో సెల్‌ఫోన్లే. ఊరు మారిపోయింది, ముందుకు వెళ్ళింది. కానీ తన బతుకే చెద పట్టిన కొయ్యలా నానాటికీ చితికిపోతోంది'. నిట్టూర్చాడు వీరాచారి. గులకరాళ్ళ చిట్కా తెలిసినా - అన్నీ ఖాళీ కుండలే దర్శనమిచ్చినప్పుడు నిస్పృహ ఆవరించిన కాకిలా తన కార్ఖానాలో కూర్చుని అలాగే రోడ్డువైపు చూస్తున్నాడు. చేయడానికి పనీ లేదు, చేసిన సరుకుకు గిరాకీ లేదు.

చేతిలో టిఫిన్ బాక్సున్న ప్లాస్టిక్ బుట్టతో, మూపున మోపెడు పుస్తకాలున్న బ్యాగ్‌తో, చిన్నబుచ్చుకున్న ముఖంతో, నీరసంగా వచ్చింది పల్లవి.

“ఫీజు కట్టకపోతే రేపటి నుంచి స్కూలుకు రావద్దన్నారు డాడీ! ఇదిగో స్కూలు వాళ్ళు పంపిన లెటర్!” స్కూలు వాళ్ళ శ్రీముఖాన్ని వీరాచారి చేతిలో పెట్టింది కూతురు పల్లవి. ఇంగ్లీషులో ఉన్న ఆ శ్రీముఖాన్ని అందుకున్నాడే గానీ - చదవడం రాదు వీరాచారికి.

“ఎంత కట్టాలమ్మా?” అడిగాడే గానీ - కొంత కట్టడానికైనా వీరాచారి జేబు నిండుకుంది.

“సెకండ్ టెర్మ్, థర్డ్ టెర్మ్ కలిపి నాలుగు వేలు కట్టాలి. ఫీజు కట్టని వాళ్ళందరినీ ఈ రోజంతా క్లాస్ బయటే నిలబెట్టేశారు”. చిగురుటాకుకు ముల్లు గుచ్చుకున్నట్టు పదేళ్ళ పల్లవి ముఖం అవమానంతో ఎర్రబారింది. వీరాచారికి కోపం వచ్చింది. ఉక్రోషం వచ్చింది. ఏమీ చేయలేక కసిగా సుత్తి చేతిలోకి తీసుకుని దగ్గర్లోని కొయ్యకు ఓ మేకు దిగ్గొట్టాడు. కోపం దిగమింగుకుని -

“కొన్ని రోజులు ఆగమనమ్మా” కూతురే స్కూలు యాజమాన్యం అన్నట్టు బేలగా, అభ్యర్థ

**బి. వెంకటేశ్వరరావు**

నగా చెప్పాడు.

"లేదు డాడీ! రేపే కట్టాలి. ఫీజు కట్టకపోతే పరీక్షలు కూడా రాయనివ్వమన్నారు. వచ్చే వారమే పరీక్షలు" దిగులుగా చెప్పింది పల్లవి. ఆ లేత కళ్ళలో పరీక్షలకు దూరమవుతానేమోనన్న బెదురు కదలాడింది.

"సరే – రేపు నేను స్కూలుకు వచ్చి మాట్లాడతాన్లేమ్మా! నువ్వు కంగారుపడకు" కూతురి దిగులు పోగొట్టడానికి భరోసా ఇచ్చాడే కానీ – వీరాచారికి ఏ దారీ తోచలేదు. అంగుళం మందమే ఉన్న చెక్కకు వాసం మేకు దిగ్గొడితే చిట్లిపోయినట్టు మనసు వికలమైంది. వారం రోజులకు పైనుంచే చేతికి పనిలేదు. ఊళ్ళో ఎవరూ చావనట్టుంది – ఒక్క గిరాకీ తగల్లేదు. శవపేటిక కావాలంటూ ఒక్కడూ రాలేదు. కార్ఖానాలో తయారుగా ఉన్న అరడజను శవపేటికలు అనాథ ప్రేతాల్లా పడి ఉన్నాయి. పని లేక వీరాచారి చేతులు గోళ్ళు గిల్లుకుంటూంటే, పచ్చి కొయ్యను లోకువ కట్టిన ఉలిలా డబ్బుల్లేని జేబు గుండెలకు గుచ్చుకుంటోంది.


*   *   *

వడ్రంగి వీరాచారి పదేళ్ల క్రితం కొద్దిపాటి స్థలాన్ని అద్దెకు తీసుకుని, చిన్న కార్ఖానా పెట్టుకున్నాడు. కార్ఖానాకు చేర్చి ఉండే మరో గదిలోనే నివాసం. అతడి చేతి ఉలి తాకితే చాలు... ఎండిన కొయ్యలు కళాఖండాలుగా అవతరించేవి. ఇళ్ళ కాంట్రాక్టులు తీసుకున్న వారు అందమైన సింహద్వారాలు తయారు చేసే పనిని వీరాచారికి అప్పగించేవారు. అయితే ఓ సంవత్సరం సిమెంట్, భవన నిర్మాణ సామగ్రి ధరలు విపరీతంగా పెరిగి, పంటలు పాడై జనం దగ్గర డబ్బులుడిగి ఇళ్ళ నిర్మాణం అంతంతమాత్రంగానే జరిగింది. దాంతో వీరాచారి వంటి వారి ఉలులకు పని లేకుండా పోయింది.

ఆ సమయంలోనే శవపేటికలు తయారు చేసే అప్పారావు చాలా కాలం సుస్తీపడి చనిపోయాడు. ఆ ఊళ్ళో శవపేటికలు తయారు చేసే ఒకే ఒక్క వడ్రంగి అప్పారావు. అతడి కార్ఖానాలో ఎప్పుడూ వేర్వేరు సైజుల శవపేటికలు ఉండేవి. 'వడ్రంగికి తెడ్డు కొరత' అన్నట్టు – మతరీత్యా శవపేటికలో ఉంచి ఖననం చేయాల్సిన అప్పారావు చనిపోయేసరికి ఒక్క పేటికా లేకుండా పోయింది. తోటి వడ్రంగులు తటపటాయిస్తూంటే – వీరాచారి ఏ మాత్రం సంకోచించకుండా అప్పారావు కొలతలతో గంటలో శవపేటిక తయారుచేసి ఇచ్చాడు. అయితే అదే తన నైపుణ్యానికి గోరీ కడుతుందని, జీవితాన్ని పాలిష్ వెలసిన పాత కాలపు కుర్చీలా మార్చేస్తుందనీ ఊహించలేకపోయాడు. అరటి పండుని దేవునికి నైవేద్యంగా పెట్టినా ఆ చెట్టును పెరట్లో పెంచడం అశుభంగా భావించగల జనం – శవపేటిక చెక్కిన చేతులతో పదికాలాలపాటు కాపురముండాల్సిన ఇంటి పనులు చేయించుకోవడం శ్రేయస్కరం కాదని ఆనాటి నుంచి వీరాచారితో నగిషీ పనులు చేయించుకోవడం మానేశారు. దాంతో రెక్కలున్నా ఎగరడానికి పనికిరాని ఫారం కోడిలా – వీరాచారి తన కళను మరిచిపోయి అప్పారావు వారసునిగా శవపేటికల తయారీకి పరిమితం కాక తప్పలేదు. తన స్తోమతు మునగ కొమ్మలా అల్పమైనదైనా – ఒక్కగానొక్క కూతురి జీవితం బర్మా చేవ నగిషీ టేకులా అందంగా, పటిష్టంగా ఉండాలని ఫీజు ఎక్కువైనా పేరున్న ప్రైవేట్ స్కూలులో చేర్చాడు.

*   *   *

మర్నాటి ఉదయం శవ పేటికల కోసం ఎవరైనా వస్తే బేరం చూడమని భార్య లక్ష్మికి




పురమాయించి, కూతుర్ని తీసుకుని సైకిలుపై స్కూలుకెళ్ళాడు వీరాచారి. అరగంట వేచి ఉన్నాక కరస్పాండెంట్ నుంచి రమ్మని పిలుపు వచ్చింది. లోపలికెళ్ళాక చేతులు కట్టుకుని నిలబడే అన్నాడు -

"సార్! ఫీజు కట్టలేదని ఇవాళ్టి నుంచి స్కూలుకు రావద్దన్నారట! సొమ్ములకు కొంచెం కటకటగా ఉంది. కొన్ని రోజులు గడువిస్తే కట్టేస్తాను సార్!"

కరస్పాండెంట్ ఏకవచనంతోనే సంబోధిస్తూ "ఏమయ్యా! అంత కట్టలేని వాడివి మున్సిపల్ స్కూలులో చేర్చక మా దగ్గరెందుకు చేర్చావు? స్కూలు నడపడానికి మాకు నెలకెంత ఖర్చవుతుందో తెలుసా? ఫీజులు కట్టకపోతే మేమెక్కడి నుంచి తెచ్చి పెడతాం? ఎంతని పెడతాం? ఇప్పటికే మూడుసార్లు నోటీసిచ్చాం. ఫీజు కట్టే వరకూ స్కూలుకు పంపక్కర లేదు. ఇక నువ్వు వెళ్ళొచ్చు" ఖండితంగా చెప్పేశాడు.

"అలా కాదు సార్! వచ్చే వారం నుంచి పరీక్షలంటోంది. నాలుగు రోజులు గడువివ్వండి సార్!" అవమానంతో, నిస్సహాయతతో గొంతు ఇరుకవుతుండగా ప్రాధేయపడ్డాడు వీరాచారి. తండ్రి అవస్థను చూస్తున్న పల్లవికి పేము బెత్తంతో మనసుపైనే కొట్టినట్టనిపించింది. కరస్పాండెంట్ ముఖంలో పక్కింటి టీవీలో తాను చూసే కార్టూన్ సీరియల్‌లోని లోహపు విలన్ కనిపించాడు. 'అల్లావుద్దీన్ అద్భుత దీపం ఈ క్షణంలోనే తనకు దొరికితే బాగుండు... భూతంతో బోలెడంత డబ్బు తెప్పించి కరస్పాండెంట్ ముఖం మీద కొట్టొచ్చు' అనుకుంది.

ఫైవ్‌స్టార్ హోటల్‌లోకి చొరబడ్డ ముష్టివాడిని చూసినట్టు వీరాచారిని ఈసడింపుగా చూసిన కరస్పాండెంట్ "వెళ్ళవయ్యా! నా టైమ్ వేస్ట్ చేయకు" అంటూ కసిరాడు.

ఎంతటి చేవ కొయ్యలనైనా ఉలితో తాను

అనుకున్న దారికి తెచ్చే వీరాచారి డబ్బు లేమి తెచ్చిన సుడిగుండం నుంచి గట్టెక్కే దారీతెన్నూ తోచక చేతులు నలుపుకుంటూ బయటికి నడిచాడు. గేటు దాటి వస్తూ వెనక్కి చూసిన పల్లవికి తమ స్కూలు బిల్డింగ్ – నిష్కారణంగా తనతో పచ్చికొట్టి, నెట్టివేసిన నేస్తంలా కనిపించింది. గుండెల్లోంచి ఎగదన్నిన దిగులు కళ్ళ నుంచి బయటికి ఉబికింది.

* * *


"ఏదోలా ఫీజు కడతాను. నువ్వు కంగారు పడకమ్మా" కూతుర్ని ఇంటి దగ్గర దింపి, తల నిమురుతూ ఊరడించాడు వీరాచారి. తిరిగి సైకిలెక్కి ఊరి మీద పడ్డాడు. వరద గోదాట్లో కొట్టుకుపోయే ఎండుపుల్లలా తిరిగాడు. తెలిసిన తోటి వడ్రంగులందరినీ కలిసి అప్పడిగాడు. ఎవరూ ఇవ్వలేకపోయారు. నడిగోదాట్లో నావ మునిగిపోనుందని తెలిసినప్పుడు ఈతరాని ప్రయాణీకుడిలా విహ్వలుడయ్యాడు వీరాచారి. ఎగుడుదిగుడు రాజమండ్రి రోడ్లపై సైకిల్ తొక్కే ఓపిక కూడా క్షీణించడంతో దిగి నడిపించుకుంటూ వస్తూంటే ఓ బ్యానర్ కనిపించింది – 'సంపద సృష్టించడం ఎలా? తెలుసుకోవాలనుకుంటే 'ఫలానా' త్రీ స్టార్ హోటల్‌లో ప్రముఖ ఆర్థిక నిపుణులు వారం రోజుల పాటు చేసే ప్రసంగాలకు హాజరుకండి. ప్రవేశ రుసుము: రు.2000లు మాత్రమే' అని రాసి ఉన్న బ్యానర్ కనిపించింది. విరక్తిగా నవ్వుకున్నాడు వీరాచారి. కాళ్ళు కట్టేసి పరుగు పందెంలో పాల్గొనమన్నట్టుంది. 'ఆ ప్రవేశ రుసుము మొత్తమే తనలాంటి వాళ్ళెందరికో సంపద కింద లెక్క. ప్రతి నెలా అంత సంపాదించే మార్గాన్ని ఎవరైనా ఉచితంగా చెపితే బాగుండును' అనుకున్నాడు.

* * *

కార్ఖానాలోని కుర్చీలో కూర్చుని చదువుకుంటున్న పల్లవి, ఆ పక్కనే చెక్కల మీద కూర్చుని బియ్యంలో రాళ్ళేరుతున్న లక్ష్మి సైకిల్ స్టాండ్ వేస్తున్న వీరాచారి వంక ఆశగా చూశారు. అలసటతో, నిరాశతో వడిలిన అతడి ముఖం చూడగానే సంగతి అర్ధమైపోయింది. లక్ష్మి మౌనంగా లేచి వెళ్ళి మంచినీళ్ళు తెచ్చిచ్చింది. నీళ్ళ గ్లాసు అందుకుని తానూ చెక్కలపై కూలబడ్డాడు వీరాచారి. ఎదురుగా ఒకదానిపై ఒకటి పేర్చిన శవపేటికలు కనిపించాయి. 'ఒకేసారి ఇవన్నీ అమ్ముడైపోతే ఎంత బాగుండును... పాతిక వందలో, మూడువేలో చేతిలో పడతాయి. తన కంత అదృష్టమా?' అనుకున్నాడు. అంతలోనే తన ఆలోచన దుర్మార్గమైనదని స్ఫురించి, తప్పు చేసినట్టు లోలోపలే తలదించుకున్నాడు. 'డబ్బు ఇప్పుడు తనకు జీవన్మరణ సమస్యగా ఉండొచ్చు. అంత మాత్రాన పరిష్కారంగా ఎవరినో చావగోరడం ఎంత పాపిష్టితనం!' అనుకునే సరికి తన మీదా, తన బతుకు తెరువు మీదా వీరాచారికి రోత పుట్టింది.

* * *

ఓ వైపు చీకటి పరుచుకుంటున్న సాయం సంధ్య వేళ మరోవైపు ఎరుపెక్కిన పడమటి మబ్బుల్లా – దుఃఖం కమ్మిన ముఖంలో ఎరుపెక్కిన కళ్ళతో శవ పేటిక కావాలంటూ వచ్చాడో యువకుడు. కొలతలు అడిగిన వీరాచారికి హృదయంలో తుప్పు మేకు దిగినట్టనిపించింది. చనిపోయింది పదేళ్ళ కుర్రాడు! అంతవరకూ దాహంతో ఉన్న వాడు నీటి కోసం తహతహలాడినట్టు గిరాకీ కోసం ఎదురుచూసాడు. కానీ, వచ్చిన గిరాకీ ఇలాంటిది అవుతుందనుకోలేదు. 'శవపేటికల అమ్మకమే తన బతుకుతెరువు అయినందుకు చావు కబురు తనకు శుభవార్తే కావచ్చు. కానీ మరీ చిగురుటాకులే రాలిపోవా




లని తాను ఎన్నడూ కోరుకోలేదు. గారాబంగా పెంచుకుంటున్న కూతురి బాధ చూడలేకేగా తాను ఒకేసారి శవపేటికలన్నీ అమ్ముడుపోతే బాగుండుననుకున్నది? అలాంటిది పదేళ్ళకే కొడుకు దూరమైన ఆ తల్లిదండ్రులకు ఇంకెంత రంపపుకోతో!' వీరాచారి మనసు అపరాధ భావనతో గిలగిలలాడింది.

తయారుగా ఉన్న శవ పేటికలన్నీ పెద్ద సైజువే కావడంతో కొలతలు కనుక్కుని చకచకా పని ప్రారంభించాడు. కుర్రాడు ఎలా చనిపోయాడని వచ్చిన యువకుడిని అడిగాడు. ఆ యువకుడు చనిపోయిన కుర్రాడికి బాబాయి. ఉండుండీ కళ్ళు తుడుచుకుంటూ చెప్పాడు.

కుర్రాడి తండ్రి బిల్డింగ్ పనులు చేసుకుంటూ బతికే కూలీ. మున్సిపల్ స్కూలులో చదువుతున్న ఆ కుర్రాడు మధ్యాహ్నం ఇంటికి వచ్చి భోజనం చేసాడు. కొన్ని క్షణాల్లోనే కడుపునొప్పంటూ పొట్ట పట్టుకుని మెలికలు తిరిగిపోయాడు. తల్లి దగ్గర్లోని ఆర్.ఎం.పి. దగ్గరకు తీసుకువెళితే మాత్రలు రాసిచ్చాడు. అవి వేసినా నొప్పి తగ్గకపోవడంతో ఏదైనా పెద్ద ఆసుపత్రికి తీసుకుపొమ్మన్నాడు. అదిరిపడే గుండెను చిక్కబట్టుకుని, ఇరుగు పొరుగు వారి నుంచి మూడొందలు తీసుకుని కొడుకును ఆటో ఎక్కించి సమీపంలోనే ఉన్న ఓ ఎమర్జెన్సీ హాస్పిటల్‌కి తీసుకువెళ్ళింది తల్లి. పరీక్షించిన డాక్టర్ 'ఇది ఎక్యూట్ అపెండిసైటిస్. వెంటనే ఆపరేషన్ చేయకపోతే కుర్రాడు దక్కడు. పదివేలు కట్టండి. ఆపరేషన్ చేసేస్తాం' అన్నాడు. ఆ అంకె తల్లిని కుర్రాడి కష్టం కన్నా ఎక్కువ భయపెట్టింది. 'భర్త చూస్తే పనిలోకెళ్ళాడు. ఉన్నా పదివేలు ఎక్కడ నుంచి తేగలడు?'

'అయ్యా! మేము లేనోళ్ళం. మీరు చెప్పిన డబ్బు ఇచ్చుకోలేం. నా బిడ్డకు ప్రాణం పోయండి. మీ ఇళ్ళలో పాచి పని చేసి రుణం తీర్చుకుంటా. చచ్చి మీ కడుపున పుడతా!' బావురు

మంటూ డాక్టర్ కాళ్ళు పట్టుకుంది.

ఆ డాక్టర్ ఆమె చేతుల నుంచి కాళ్ళను విదిలించుకుంటూ 'ఏమమ్మా! ఇది ధర్మాసుపత్రి కాదు. డబ్బు కట్టకపోతే వైద్యం జరగదు. అక్కడికే తీసుకువెళ్ళు' అంటూ వెళ్ళిపోయాడు. చావుకోరల్లో ఇరుక్కున్నట్టు కేకలు పెడుతూ ఏడుస్తున్న కొడుకును చూస్తే కాళ్ళూ చేతులూ ఆడకపోయినా ఆటోని పిలిచి అక్కడికి అయిదు కిలోమీటర్ల దూరంలో ఉన్న గవర్నమెంట్ హాస్పిటల్‌కి బయల్దేరింది. హాస్పిటల్‌కి వెళ్ళేసరికే కుర్రాడి ఊపిరి ఆగిపోయింది. తీసుకెళ్ళిన మూడు వందలూ బతికున్న కొడుకును హాస్పిటళ్ళకు తిప్పి శవంగా మోసుకురావడానికి ఆటోల ఖర్చుకు పనికివచ్చాయి.

పసివాడి చావు కథ పూర్తయ్యేసరికి శవపేటిక తయారైంది. వీరాచారి ఒళ్ళు చెమటతో, చెంపలు కన్నీటితో తడిసిపోయాయి. స్కూలులో తనకు జరిగిన పరాభవమూ, ఎమర్జెన్సీ హాస్పిటల్‌లో ఆ తల్లి పడ్డ క్షోభా ఒకే చెట్టుకు మొలిచిన ముళ్ళనిపించింది. జ్ఞానమూ, ప్రాణమూ డబ్బు కనుసన్నల్లో పనిచేస్తున్నాయనిపించింది. 'ప్రాణం పోయిన వారిని ఖననం చేయడానికే తన కార్ఖానాలో శవపేటికలు తయారుచేస్తున్నాడు. డబ్బును ప్రాణం కన్నా ఎక్కువగా లెక్కేస్తున్న లోకం తనలా కాదు... అనుక్షణం శవాలనే తయారుచేస్తోంది! జాతరలో అమ్మోరి ముందు కోళ్ళు, మేకల తలలు తెగిపడ్డట్టు డబ్బు ముందు అభిమానం, పౌరుషం, చివరికి మానవ ప్రాణం నిర్దాక్షిణ్యంగా హతమారుతున్నాయి. ఈ డబ్బు లోకం శవాలను తయారుచేసే ఓ పేద్ద కార్ఖానా!'

శవపేటికను సైకిల్ క్యారియర్‌కి కట్టుకుంటూ ఆ యువకుడు "ఎంతిమ్మంటారు?" అని అడుగుతుంటే వీరాచారికి బోనెక్కిస్తున్నట్టనిపించింది. మామూలుగా చెప్పే రేటు కన్నా తక్కువ చెప్పాడు. ఆ యువకుడు ఇచ్చిన నోట్లు అందుకుంటున్నప్పుడు వీరాచారి తల దించుకున్నాడు. రెండు కళ్ళ నుంచీ నీటి బొట్లు ఆ నోట్లపై రాలాయి.

* * *

తండ్రి పక్కనే కూర్చుని యువకుడు చెప్పిందంతా విన్న పల్లవి అప్పటికే వెక్కెక్కి పడుతోంది. తమ కరస్పాండెంట్ ముఖం గుర్తుకొచ్చింది. హాస్పిటల్‌లో కుర్రాడి తల్లిని విదిలించిన డాక్టర్ ముఖాన్ని ఊహించుకుంది. 'డబ్బు కోసమేగా వాళ్ళలా భూతాల్లా ప్రవర్తించారు. డబ్బు లేకేగా తాను బలవంతంగా స్కూలు మానేయాల్సి వచ్చింది. డబ్బు లేకేగా ఆ కుర్రాడు చచ్చిపోవలసి వచ్చింది. డబ్బుతో పచ్చి కొట్టాలి. డబ్బు మీద కచ్చి కట్టాలి.'

"డబ్బు తీసుకోవద్దు డాడీ! దాని మీద కచ్చి కడదాం డాడీ! తీసుకోవద్దు డాడీ!" వెర్రిగా అరుస్తూ తండ్రి చేతిలోని నోట్లను లాక్కుని పరపరా చింపి గాల్లోకి విసిరేసింది పల్లవి. అప్పటికే కన్నీటితో తడిసినందున కాబోలు – ఆ నోట్ల ముక్కలు గాలిలో తేలిపోకుండా నేలపై రాలాయి. ●

బద్ధకం వదిలించుకోవడమెలా? అంటూ సుదీర్ఘంగా పాఠం చెప్పిన టీచర్ తను చెప్పిన విషయంపై ఒక వ్యాసం వ్రాయమన్నాడు విద్యార్థులను.

నాలుగు పేజీలు ఖాళీగా ఉంచి, నాలుగో పేజీ చివరన 'బద్ధకం అంటే ఇదే' అని వ్రాసి ఇచ్చాడు ఓ విద్యార్థి.